
# జనసంద్రం

- గులాబీ బాస్‌కు ప్రజల బ్రహ్మరథం
- కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్
- తరలివచ్చిన అశేష జనవాహిని
- ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు
- మార్మోగిన 'జై కేసీఆర్' నినాదాలు
- గులాబీమయమైన కామారెడ్డి పట్టణం


ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనవాహిని

నిజామాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కామారెడ్డి జనంతో హోరెత్తింది. పట్టణానికి అన్ని వైపులా రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్ నామినేషన్ దాఖలు కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. అనంతరం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో అశేషజనం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం లభించింది. కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నట్లుగా ప్రకటించాక తొలిసారి ఈ ప్రాంతానికి గులాబీ బాస్ రావడంతో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతును తెలియజేశారు. 'జై కేసీఆర్' అంటూ నినదించారు. తెలంగాణ జాతి పిత కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కుండబద్దలు కొట్టినట్లుగా బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించిన తొలి నాళ్లలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన స్పందన అంతా ఇంతా కాదు. కేసీఆర్ వెంటే నడుస్తూ సమైక్య పాలకులకు వ్యతిరేకంగా స్వరాష్ట్రం కోసం పెద్దఎత్తున పోరు చేసిన చరిత్ర ఈ గడ్డ సొంతం. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఎదురైన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయాలు సాధించి కామారెడ్డి నియోజకవర్గం చరిత్రకెక్కింది. ఇప్పుడిదే ప్రాంతం నుంచి కేసీఆర్ స్వయంగా అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తుండడంతో ప్రజల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. స్వచ్ఛందంగా మద్దతు తెలిపి నాటి ఉద్యమ స్ఫూర్తిని చాటుతున్నారు. ఇందులో భాగంగా కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు జనం పోటెత్తారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

## గులాబీమయమైన కామారెడ్డి..

కామారెడ్డిలో కేసీఆర్ నామినేషన్ అట్టహాసంగా కొనసాగింది. కార్యక్రమంలో భారీ సంఖ్యలో జనాలు పాల్గొన్నారు. దారి పొడవునా ఉద్యమ నాయకుడికి ఘన స్వాగతం పలుకుతూ, అభివాదం చేస్తూ సందడి చేశారు. ముసలి, ముతక, యువత, మహిళలు గులాబీ జెండాలు పట్టుకొని కేసీఆర్ సభకు తరలి వచ్చారు. బీఆర్ఎస్ అధినేత రాకతో కామారెడ్డి పట్టణం గులాబీమయమైంది. ఎటు చూసినా పార్టీ శ్రేణులు, ప్రజలతో పుర వీధులన్నీ కిక్కిరిసి కనిపించాయి. డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభకు నియోజకవర్గంలోని మొత్తం 8 మండలాల నుంచి జనం పెద్దఎత్తున తరలి రావడంతో ప్రతిపక్షాల్లో వణుకు మొదలైంది. మోటర్ సైకిళ్లు, కార్లు, ఆటోలు, బస్సుల్లో సభకు వచ్చారు. గులాబీ కండువాలు మెడలో వేసుకుని దర్జాగా సభకు హాజరై కేసీఆర్‌కు జై కొడుతూ కనిపించారు. రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడే కామారెడ్డికి రావడంతో జనంలో పట్టరాని సంతోషం కనిపించింది. ఇంతకు మునుపు ఎన్నోసార్లు కేసీఆర్ ఈ ప్రాంతానికి వచ్చినప్పటికీ.. స్థానిక ఎమ్మెల్యే స్థానానికి బరిలో నిలువడంతో ఈసారి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకున్నది. తమ అధినేత నామినేషన్ ఘట్టంలో పాలుపంచుకునేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు తరలివచ్చారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


ఆశీర్వాద సభకు తరలివస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

## కిటకిటలాడిన డిగ్రీ కళాశాల మైదానం..

కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. ప్రజా ఆశీర్వాద సభకు ఊహించని రీతిలో తరలివచ్చిన జనాలతో ప్రభుత్వం డిగ్రీ కళాశాల మైదానం కిటకిటలాడింది. సభా సమయానికి ముందే ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి కేసీఆర్‌ను కళ్లారా చూసేందుకు నిరీక్షించారు. వేదికపైకి సీఎం రావడంతోనే ఈలలు, కేకలు వేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు తమ పెద్ద కొడుకును కేసీఆర్ రూపంలో చూసుకుంటూ మురిసి పోయారు. కేసీఆర్ అభివాదానికి కేరింతలతో ప్రతిస్పందించారు. కామారెడ్డి గడ్డ గొప్పతనం గురించి చెప్పడంతోపాటు ఉద్యమ ప్రస్థానంలో ఈ ప్రాంతం పోషించిన పాత్రను కేసీఆర్ వివరించడం అందరినీ కట్టి పడేసింది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చాక కామారెడ్డి అభివృద్ధిపై కేసీఆర్ ఇచ్చిన హామీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గులాబీ దళపతి రాకతో కామారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి తీరుతెన్నులపై అంచనాలు భారీగా పెరిగాయి. అందుకు తగ్గట్లుగానే కేసీఆర్ సైతం ప్రకటన చేయడంతో జనంలో సరికొత్త జోష్ కనిపించింది.

## బీఆర్ఎస్ పాలన భేష్..



మాచారెడ్డి, నవంబర్ 9 : బీఆర్ఎస్ పాలన బాగుంది. సంక్షేమ పథకాలు, వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ఇందుకు నిదర్శనం. తక్కువ కాలంలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్. అలాంటి నాయకుడి పాలన కొనసాగాలి.

**-కటుకం సాయిరెడ్డి, వాడి, పాల్వంచ మండలం**

## మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి..



వేరే పార్టీల వాళ్లు ఎన్ని కుట్రలు చేసినా, మాయమాటలు చెప్పినా మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావడం గ్యారంటీ. రేవంత్‌రెడ్డి లాంటివారు వందమంది వచ్చినా తరిమి కొడతాం. గరీబోళ్లు బాగుండాలంటే కేసీఆర్ సార్‌ను గెలిపించుకోవాలి.

**-గంగవ్వ, దేవునిపల్లి, కామారెడ్డి**

## సీఎం చెప్పేది వినేందుకు వచ్చిన..



సీఎం కేసీఆర్ సార్ మాట్లాడేది, ఆయన చెప్పేది వినడానికి మీటింగ్‌కు వచ్చిన. కామారెడ్డికి ఇప్పటిదాకా ఏంచేశారో పూసగుచ్చినట్లు చెప్పిండు. ఇంకా ఏం ఇస్తడో కూడా చెప్పిండు. కేసీఆర్‌ను గెలిపించుకుంటే మా జిల్లా మొత్తం ఇంకా బాగైతది.

**-ప్రమీల, దేవునిపల్లి, కామారెడ్డి**

## ఆర్‌బీవీఆర్‌ఆర్ హాస్టల్‌కు నిధులివ్వండి

### సీఎం కేసీఆర్‌కు ట్రస్టు బాధ్యుల వినతి

మాచారెడ్డి, నవంబర్ 9 : రాజా బహదూర్ వెంకట్‌రాం రెడ్డి ట్రస్టు హాస్టల్ భవనం కోసం నిధులు మంజూరు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. కామారెడ్డి పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ ట్రస్టు వసతిగృహం కోసం కామారెడ్డి శివారులో ప్రభుత్వం ఇప్పటికే ఐదెకరాల స్థలం కేటాయించిందని, భవన నిర్మాణానికి మరో రూ.10 కోట్ల నిధులు ఇవ్వాలని కేసీఆర్‌కు విన్నవించారు. ఇందుకు సానూకులంగా స్పందించిన సీఎం.. నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యనిర్వహణ అధ్యక్షుడు జూకంటి మోహన్‌రెడ్డి, మాచారెడ్డి జడ్పీటీసీ మినూకూరి రాంరెడ్డి, తిర్మల్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, నిమ్మ మోహన్‌రెడ్డి, భీంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, గంగారెడ్డి, గోవింద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

## ఇది రైతుల ప్రభుత్వం..



బీఆర్ఎస్.. రైతుల ప్రభుత్వం. పెట్టుబడి సాయం ఇస్తున్నది. ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నది. కష్టపడి పండించిన పంటను కూడా సర్కారే కొంటున్నది. పైసా తీసుకోకుండా రూ. 5లక్షల రైతుబీమా చేయించి మా కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నది. రైతుకు ఇంతకన్నా ఏం గావాలె. కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకుంటం.

**-మీసాల బాలరాజు, లింగాపూర్**

## కేసీఆర్ పాలన అద్భుతం..



ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం చేసింర్రు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి ప్రత్యేక రాష్ట్రం సాధించారు. ఆయన పాలన అద్భుతం. పట్టుదలతో పదేండ్లలోనే తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో మొదటి స్థానంలో నిలబెట్టారు. రాష్ట్రానికి ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలి.

**-జనార్దన్‌రెడ్డి, కంచర్ల, భిక్కనూరు మండలం**

## బీఆర్ఎస్ ఇంటిపార్టీ..



ముసలోళ్లకు, కాళ్లు చేతులు సరిగా లేనోళ్లకు బీఆర్ఎస్ సర్కారు మస్తు పింఛన్ ఇస్తున్నది. మళ్లీ గెలిస్తే ఇంకా పెంచుతమంటున్నడు కేసీఆర్ సార్. ఆయన ఇచ్చిన మాట తప్పడు. బీఆర్ఎస్ మా ఇంటిపార్టీ. వేరోళ్లను దగ్గరికి రానియ్యం.

**-ఉమాకళ, రామారెడ్డి మండలం**

## కేసీఆర్ అంటే నమ్మకం..



సీఎం కేసీఆర్ అంటేనే నమ్మకం. పదేండ్లళ్ల మస్తు పనులు చేసింర్రు. బీడోళ్లను ఆదుకున్నరు. ఇంకా కొత్త కొత్త పథకాలు తెస్తమంటున్నరు. కేసీఆర్ హామీ ఇచ్చిండంటే.. తప్పకుండా నెరవేరుస్తడు. గులాబీ పార్టీనే మళ్లీ గెలవాలె.

**-శోభ, కామారెడ్డి**

## కేసీఆర్ సార్‌ను మర్చిపోం..



మా గిరిజనులు ఎప్పటినుంచో ఆశ పెట్టుకున్న పోడు భూములకు కేసీఆర్ సార్ పట్టాలు ఇచ్చిండు. తండాలను పంచాయతీలు చేసిండు. ఆయన మేలును మర్చిపోము. మమ్మల్ని, మా బాధల్ని కాంగ్రెస్ ఎన్నడూ పట్టించుకోలేదు.

**-లక్ష్మణ్, స్కూల్‌తండా, రెడ్డిపేట**